చెమ్మట గ్రమ్మక తప్పదు. మరి సృష్టిలో యట్టిమూర్తి నెద్దాని నరసినప్పటికి అదో అంతులేని కళవళిక జనించి లిలువెల్ల నీడ లేని ఊగిసలాట తూగిపోవును! ఏది యూపునది? ఎవరు చూపునది?

.... .... .... .... ....

## మంచుగది

"మా నాన్నను మర్నాడు రాత్రిఅల్లా మంచుగదిలో వుంచారుట! ఎందుకంటారు? పెద్దనాన్నగారూ?" అని అడిగేడు చిన్నకుఱ్ఱవాడు—వానితో కొంతసేపు నేను పరామర్శప్రస్తావన జరిపిన యీ వెనుకటి విస్తరింపులో. వానికేమని చెప్పేది జవాబు? "అదో విధమైన చికిత్స కావచ్చును" అని ప్రత్యుత్తరమిచ్చాను. "చికిత్స కాదన్నారండి డాక్టర్లు శరీరాన్ని చిరంతనంగా వుంచేది మంచుగడ్డ అన్నారండి వాండ్లు! ఆ పెద్ద పెద్దవాండ్లు! ఆ జెనరల్ హాస్పిటాల్లో! ఆ మదరాసులో!"

ఇలా కుఱ్ఱవాడు తన విజ్ఞానాన్ని వెదజల్లుతూవుంటే నా హృదయం కరిగి నీరైంది. నీరవుండనై ఏదో తలపోశేను. నా తలపోత కడ్డొచ్చినట్టు ఆ బిడ్డడు "మంచుగడ్డ కరిగిపోకుండా వుంటుందా అండీ! మరి!" అని అడిగాడు. "గడ్డ వెనుక గడ్డ పెడతారులాగుంది" అన్నాను, ఏదో జవాబు నాకు చెప్పాలికదా అని. కాని నా అంతస్సు అప్పటికప్పుడే నానుండి విడివడి పోయింది. ఎచ్చటెచ్చటో పక్షిలా ఎగిరిపోతూ వుంది. "అయితే హిమాలయం మధ్య చావులేదన్నమాట" అని అడిగాడు మళ్ళీ

అదో విచిత్రంగా ఆ బుజ్జితడు నేనప్పటి కప్పుడే యేదో అమృతమాధుర్యం చవిగొంటూ, వానికి చెప్పలేనంత వివశత్వంలో వుండివున్నాను.

ఈపై పళ్నలన్నీ శ్రీరంగపట్నములో జన్మించి, చెన్న పట్టణంలో మృతినందిన నా తరువాతి సహజన్ముణ్ణి గురించి— "హిమాలయపర్వతంమీదకూ్కడా సూర్యుడుదయించి మంచును కరగిస్తూ వుంటాడనుకుంటాను" అని అన్నాను ఏదో దృశ్యం కళ్ళముందుకు తెచ్చుకుంటూ. నా కళ్ళముందరి దృశ్యం చిన్న పిల్లవానికి తెలియబఱచనా వద్దా అనే డోల నొకలిత్త ఆలా వుండిపోయాను తెప్ప వేసికోకుండా!

అసలు చెప్పదలచుకొన్నదిది. ఆతగాడున్నాడే నా తరు వాతివాడు చిన్నప్పుడు మూడేళ్ళప్పుడు చాలా చాలా ముద్దొస్తూ వుండేవాట్ట! ఆ రోజుల్లో ఒకప్పుడు మా వూళ్లో గొప్పగా ఒక కాపులింట పెళ్ళి అయిందట—ఆ పెళ్ళికి గుంటూరునుంచి అను కొంటాను, పది పదహారుగురు సజ్జువున్న భోగంమేళం తెప్పించా రుట. భోగంవాళ్లు అంటే ఆ కాలంలో కీర్తికాములచే కోరబడే ఆడవాళ్ళు. ఆ ఆడవాళ్ళు కల్తీలేని రూపంతోను కులాభిమానం తోను కళకోసమే జన్మించినట్టుండేవారుకూడాను. వాళ్లు ఆరోజుల్లో కట్టుకునే చీరలుకూడా పెద్దపెద్ద జరీచీరలు, పెట్టుకునే నగలు కూడా బంగారపు కంటెలు. కాసులపేర్లూను. భోగస్త్రీకి సంసారికి ఆ రోజులలో తేడా కాపరిచేది కంటె అనే నగే. ఈ కంటె— బంగారపుది. పయటమీదను వేసుకు మిలమిలామందా ఆమె భోగంది. పయట లోపట కంటె పుంచుకు తలపుకు వచ్చిందా ఆమె సంసారి. మరి పౌడర్లనుబట్టి, పాపిళ్ళనుబట్టి కనిపెట్టేందుకు ఆ రోజుల్లో ఈ రంగుడబ్బాలూ లేవు, ఈ సిగసూదులూ లేవు.

ఏదో చెప్పవచ్చి ఏదో గ్రుచ్చెత్తుకు వున్నట్టున్నాను. క్షమించండి! ఆ కాపుల యింట్లో పెళ్ళికి వచ్చినమేళం భోగ మాట ఆడే తరుణంలో ఇతడు ఈ మూడేళ్ల పసికందూ ఆ ఆడే దాని మెళ్లో—ఆమె కూర్చుని అభినయిస్తూవుందో ఏమో— వీడు ఈ పసకందు మఱీ ముందుకు కూర్చున్నాడేమో కాలి మువ్వలు వింటూ,—ఆమె ఏ మువ్వగోపాల పదమో పట్టే సందర్భంలో మఱీముందుకు వంగిందేమో—వీడు అందుకోవడంలో తన చిట్టిచేయి ఆలా సాచాడేమో—ఆమె మెడలోని కంటె వీని చేతికి చిక్కింది వీడు కంటె వదలడు! ఆమె వానిచేయి వదలదు! ఆట కట్టడింది!

ఈ పిల్లడి అందం, ఇతగాడి ఆనందం, ఇతగాడి ఆళ తమాషా కనిపెడుతూ ఆ మూడేళ్ళ కుఱ్ఱణ్ణి "ఎడోనిస్" ని కనుక పదిమంది "వీనస్‌లు"లు ఒక్కుమ్మడి చుట్టేసినట్టు చుట్టేసినవారై ఆ భోగస్త్రీలందరూ ఒకళ్ళతరువాత ఒకళ్ళు తమ చేతులమీదకు తీసికొంటూ వీడు వాళ్ళ ముక్కట్టుకుంటే, వాళ్ళు వీణ్ణి ముద్దెట్టుకుంటూ "నాకో గుమ్మడిపండు దొరికింది" అంటే "నాకో గుమ్మడిపండు దొరికింది" అని ఎవళ్ళకు వాళ్ళు ఊఁ ఇదై పోయారుట!

భోగంవాళ్ళకు చిన్న పిల్లలు అంటే అంత ప్రేమ వుంటుందా? అనేది వొక సమస్యే! అయితే మనం ఇప్పుడు చూచే భోగంవాళ్ళు అందఱూ పిల్లల్ని ఏవగించుకునేవాళ్ళు కావచ్చును. ఆ రోజుల్లో వాళ్ళకు పిల్లలు అంటే అపేక్షవుండి వుండవచ్చును.

ఇంతకూ, కనబడ్డ పిల్లకాయనల్లా వాళ్లమాత్రం, ఆపూళ్లో అన్నాళ్లున్నారు, ఎత్తుకున్నారా అదంతా ఇతగానిరూపురేకల్నిబట్టే

అని మనం అనుకోనాలి. ఇతను అప్పట్లోచూపిన బొద్దునుబట్టే విద్దెంను బట్టే అని అనుకోవాలి. నాయీసహజమ్మని జీవిత గాధను గుఱించి నేనెప్పుడు తలపోసినా అలనాటి ఆ వింతగాధ ఆదిమంగా అమాయికంగా నా ఆత్మకు తట్టుతుంది.

అదే దృశ్యం అతడు దివంగతుడైన తరుణంలో కూడా నాకాపొద్దు తలపోతకు రాకతప్పిందికాదు. ఆ దృశ్యం అప్పట్లో నన్ను ప్రశ్నించిన " నాంవుకు " వర్ణించడం ఎట్లా ? నా నాలుక వెనుకాడింది. నాలుక వెనుకాడడంలో చనిపోయిన ఆ సహజమ్మని పోలిక లోలో ప్రకాశించింది.

" శరీరమెక్కడ దాచినా నశించేదే బిడ్డా ! ఆత్మకే చావు లేదు." అని నా యెట్టయెదుట ఇంకనూ కూర్చుని ప్రత్యుత్తరం కాంక్షిస్తూవున్న కొండికతో అన్నాను. ఆ కుఱ్ఱడు " ఆత్మ మాత్రం ఎలా శాశ్వతంగా వుంటుంది ? మంచుకంటె చల్లనైన కరగని నిత్యశీతల పదార్థమేదైనా దాన్ని కాపాడుతూ వుంటుందా ? " అని అడిగాడు—వానికింకా మంచుగది—కాదు కాక మంచుకొండ-వేగుబోక ఆలా మనస్సును బట్టి వుండబోలు !

" లేదుమఱీ పరమాత్మ ? దానిలో లీనమై ప్రతీ ఆత్మ శాశ్వత శాంతిభావం సహించి తీరుతుంది. నిత్య సత్యశీతలం అది వాక్కుటే. ఎన్నటికీ కరగనిది అది వాక్కుటే " అని సూటిగా వాక్రుచ్చాను.

.... .... .... .... ....

## మాతృ చిహ్నము

నేనే కాదు, ఏ మానవుడు కాని, తన పుట్టిన తేదీని గురించి తాను పుట్టినప్పుడు తనతల్లి పడిన ప్రసవ వేదనాదులను గురించి